


పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్నుమా హెూటల్‌లో 'ఇంధన రంగంలో పరివర్తన కోసం తీసుకోవాల్సిన తగు చర్యలు'పై ఏర్పాటు చేసిన సమీక్షలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ కె.సి వేణు గోపాల్, కమిటీ సభ్యులు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, సహచర కమిటీ సభ్యులు, అధికారులు.

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం బాపట్ల
శుక్రవారం 10 జనవరి 2025 పేజీలు 8

# మార్కాపురం తెదేపాలోకి భారీగా చేరికలు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చేరిన కౌన్సిలర్లు

13 మంది కౌన్సిలర్లను కండువా కప్పి ఆహ్వానించిన మంత్రులు గొట్టిపాటి, స్వామి

మాజీ మార్కెటింగ్ యార్డు ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్‌లతో పాటు మరో 2 వేల మంది చేరికలు

వైకాపా హయాంలో అభివృద్ధికి నోచుకోని జిల్లా: మంత్రి గొట్టిపాటి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి: మంత్రి స్వామి

మార్కాపురం, మేజర్‌న్యూస్: మార్కాపురం తెలుగుదేశం పార్టీలోకి భారీగా వైసీపీ కార్యకర్తలు, నాయకులు చేరారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సమక్షంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్లు గురువారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 13 మంది కౌన్సిలర్లను టీడీపీ కండువా కప్పి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామిలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కాపురం మార్కెటింగ్ యార్డ్ ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్‌లు మరో 2000 మందితో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలన నచ్చి నేడు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం మూడు నెలల్లోనే వెనుకబడిన జిల్లా గుర్తించేలా చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటీ నెరవేరుస్తూ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుని వెళ్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా కూడా లేని విధంగా ఎక్కువ మొత్తంలో ఒకటో తారీఖు నాటికి వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మిగతా 3లో





## నేడు, రేపు ఎంపి మాగుంట పర్యటన



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 10వ తేదీన ఒంగోలు నగరానికి రానున్నట్లు కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. సాయంత్రం 7 గంటలకు నగరంలోని రామ్‌నగర్ రెండో లైన్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 7.30కి నగరంలో జరుగు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8 గంటలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 11న ఉదయం 8 గంటలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 10 గంటలకు గుంటూరు రోడ్డులోని ఐటిఐ కాలేజీ ప్రాంగణంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల ముస్లింలు నిర్వహించు ఇస్తిమా కార్యక్రమంలో పాల్గొంటారు. 11కి ఒంగోలు ఏ 1 కన్వెన్షన్‌లో క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ నిర్వహించు ప్రాపర్టీ, బిల్డింగ్ మెటీరియల్ షో కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6 గంటలకు ఒంగోలు పట్టణం, చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని కాంపస్‌లో శ్రీ సరస్వతి విద్యా సంస్థల సిబ్బంది నిర్వహించు 34వ వార్షికోత్సవ, జల్సా వేడుకలలో పాల్గొంటారని తెలియజేశారు.

# చీరాల కుప్పడం ప్రదర్శనను తిలకించిన కేంద్ర బృందం

## జాతీయ స్థాయిలో చీరాల కుప్పడం చీరలకు ప్రత్యేకత

## కేంద్ర బృందానికి స్వాగతం పలికిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మేజర్‌న్యూస్: 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' కింద ఎంపికైన చీరాల కుప్పడం చీరలకు జాతీయస్థాయిలో ప్రత్యేకత ఉందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. చీరాల కుప్పడం చీరలు ఎంపికైన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందం సభ్యులు ఇష్‌దీప్, డాక్టర్ దివ్యడింగ్రా గురువారం జిల్లాకు చేరుకున్నారు. కేంద్ర బృందం సభ్యులను జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కుప్పడం చీరల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం పిపిటి ద్వారా



చీరాలలో చేనేత వస్త్రాల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై చేనేత జౌళిశాఖ అధికారులు కేంద్ర బృందానికి నివేదిక అందజేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చీరాల పేరాల ఉద్యమ ప్రాశస్త్యాన్ని కేంద్ర బృందం సభ్యులకు అధికారులు వివరించారు. మినీ ముంబాయిగా ప్రాచుర్యం పొందిన చీరాల ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. బ్రిటీష్ పరిపాలనను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన స్వాతంత్ర ఉద్యమంలో చీరాల నుంచి స్వాతంత్ర సమరయోధులు పాల్గొన్నారని చెప్పారు. విదేశీ మిగతా 3లో

## రెవెన్యూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ నెల 8వ తేదీతో రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో అన్ని మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో కలెక్టరేట్‌లో గురువారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు నేపథ్యాన్ని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. దీనికోసమే ఇటీవల కలెక్టర్లకు జోనల్ స్థాయి సమావేశాన్ని కూడా మంత్రి, రెవెన్యూశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ, సి.సి.ఎల్.ఎ నిర్వహించడాన్ని ప్రస్తావించారు. ఈ దృష్ట్యా రెవెన్యూ



సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో మండల సర్వేయర్‌తో తహసీల్దారు ప్రత్యేకంగా చర్చించి రెవెన్యూ, రెవెన్యూయేతర సమస్యలకు సంబంధించిన అర్జీలను వేరుపరచాలని చెప్పారు. సమస్యల మిగతా 3లో

## 9వ రోజు సజావుగా దేహదారుఢ్య పరీక్షలు

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డ్ నియమ నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా బుధవారం జిల్లా పోలీసు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. నిర్వహణ క్రమంలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన, బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీకొలత వంటి ఫిజికల్ మెజర్‌మెంట్‌లు చేయబడతాయని, దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ వంటి అంశాలను ఆధునిక కంప్యూటరైజ్డ్ టెక్నాలజీ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పరికరాలతో పకడ్బందీగా జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షించారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన అభ్యర్థులతో ఎస్పీ మాట్లాడి ఈవెంట్స్ సమయంలో పాటించవలసిన



టెక్నిక్స్‌ను గురించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. గురువారం 552 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 365 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు. అభ్యర్థుల దేహదారుఢ్య, పరుగు మిగతా 3లో

## చిన్నారి యువన్ పుట్టినరోజు వేడుకల్లో బాపట్ల ఎమ్మెల్యే



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రావిపూడి నాగమల్లేశ్వరరావు మనవడు యువన్ రెండవ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంత వర్మ, బాపట్ల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మానం విజేత, తెలుగుదేశం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో జూదలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వై.నాగరాజు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగ ను జరుపుకోవాలని ప్రజలను ఎస్ఐ కోరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా ఇతర గ్రామాలకు, ప్రాంతాలు కు వెళ్లే వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. సమాచారంను స్థానిక పోలీస్ స్టేషన్ ఇచ్చినట్లు అయితే గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్‌తో ప్రయాణం సురక్షితం అని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## స్మశానాల అభివృద్ధికి కృషి చేస్తా



దర్శి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలోని స్మశానలు అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. దర్శి పట్నంలోని పొదిలి రోడ్డు లో ఉన్న స్మశాన వాటికను మున్సిపల్ చైర్‌పర్సన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, స్థానిక ప్రజలు పాల్గొని గత 30 సంవత్సరాల పైబడి ఇక్కడ స్మశాన వాటికను నిర్వహించుకుంటున్నామని, ప్రభుత్వ నిధులతో స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని అధికారులను స్థానిక ప్రజలు కోరారు.

## వనిత వాసవి క్లబ్ ముగ్గుల పోటీలు



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నగర పంచాయతీ లంకోజనపల్లి రోడ్డు లో ఉన్న ఎస్సీ గర్ల్స్ హాస్టల్లో దర్శినాపురి వనిత వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారము ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు వనిత వాసవి క్లబ్ అధ్యక్షులు దేసు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి కొల్లూరి సుశీల, ప్రధాన కోశాధికారి తెల్లాకుల సత్యలక్ష్మి సహాయ సహకారాలు అందించారు. వనిత వాసవి క్లబ్ లోగోను జుజ్జురి ప్రేమ సంగీత, ముప్వల అనంతలక్ష్మి ఇరువురు రంగులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ రంగవల్లి ముగ్గుల పోటీల్లో వనిత వాసవి క్లబ్ లోగో ప్రత్యేకంగా ఆకర్షంగా నిలిచింది. రంగవల్లి ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు వనిత వాసవి క్లబ్ అధ్యక్షులు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి కొల్లూరి సుశీల, ప్రధాన కోశాధికారి తెల్లాకుల సత్యలక్ష్మి బహుమతులులను ప్రధానం చేశారు. రంగవల్లి ముగ్గులు పోటీల్లో పాల్గొన్న అందరికి వనితవాసవి అధ్యక్షురాలు దేసు సంధ్యరాణి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రధాన కూడలిలో మౌలిక సదుపాయాలు పరిశీలన



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘ పరిధి పలు ప్రాంతాలను మునిసిపల్ కమీషనర్ జి.రఘు నాథ రెడ్డి పరిశీలించారు. శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తో కలిసి శ్రీ నందమూరి తారక రామారావు కూరగా యల మార్కెట్ ను, రైతు బజార్ ను పరిశీలించారు. అనం తరం కమీషనర్ సిబ్బందితో కలిసి క్రిస్టియన్ భవన్ రోడ్డు లో డ్రైనేజీ నందు అధికంగా మురికి నీటి నిల్వలు ఉండడం, పారుదల సక్రమంగా లేని దాని గురించి పారిశుద్ధ్య విభాగ అధికారులతో మాట్లాడారు. యుద్ధప్రాధిపదికన నీటి నిల్వ లు లేకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్ కు ఆదేశించారు. గడియార స్తంభం దగ్గర నుండి సూర్యలంక వైపు గల రోడ్డు మార్జిన్ ల నందు ఫుట్ పాత్ ల పై ఆక్రమ ణల గురించి పట్టణ ప్రణాళిక అధికారికి కొన్ని సూచనలు చేశారు. ఆక్రమణ దారులకు తెలియజేసి ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం అన్న క్యాం టీన్‌ను పరిశీలించి అక్కడికి వచ్చిన ప్రజలను ఆహార నాణ్య త, త్రాగునీరు, శుభ్రత గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఆయన వెంట పట్టణ ప్రణాళిక అధికారి యస్.మల్లిఖార్జున రావు,అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్,రెవి న్యూ ఇన్స్పెక్టర్ లు శివరామకృష్ణ, షేక్ ఇమామ్, శానిటరీ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

# ప్రతి విద్యార్థికి అఖండ వెలుగు : విన్నకోట సురేష్



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల మునిసిపల్ హైస్కూల్లో నందు గురువారం అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగు అధ్యాపకులు ప్రసాదిస్తే వారికి మెరుగైన కంటి చూపు అందించాలని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న అఖండ ఫౌండేషన్ ఆలోచన అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా అక్కండా ఫౌండేషన్ అధ్యక్షులు వెన్నకోట సురేష్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి విచ్చేసిన కలెక్టర్ కు, డిఎంహెచ్ఓ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కంటి చూపు మెరుగ్గా ఉండటం వల్ల విద్యార్థులకు చదువు కొను టకు ఎంత ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ గ్లోరియా, డిఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, తహసి ల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ జి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు జయంతి సభ



రేపల్లే, మేజర్‌న్యూస్: సంఘుసంస్కర్త విద్యావేత్త భారతదేశపు మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జీవితం భావితరాలకు ఆదర్శనీయమని న్యాయవాదులు ప్రజా సంఘాల నాయకులు దోవా రమేష్ రంజి మునిపల్లి సుబ్బయ్య దారం సాంబశివరావు మస్తాన్ వలి లు కొనియాడారు. గురువారం షేక్ ఫాతిమా 194వ జయంతి వేడుకలను తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటాన్ని రేపల్లె న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కేసన వెంకట గోపాలరావు రేపల్లె పట్టణ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది మెండు వెంకట సుబ్బారావు మస్తాన్ వలి లు ఆవిష్కరించిన అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక ఉద్యమ విప్లవ మూర్తులు మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రి బాయి పూలే దంపతులు 1852లో మహారాష్ట్ర పూణే పట్టణంలో మొట్టమొదటిగా బాలికలు కోసం ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి విద్యను నేర్పుతున్న సమయంలో ఆనాటి స్త్రీ అభ్యున్నతికి వ్యతిరేకంగా ఉన్నటువంటి సమాజం వారిని అనేక విధాలుగా అవహేళనలు చేసి అవమానాలకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహమ్మద్ రబ్బాని ఆయుఖాన్ ఏజిపి జొన్నాదుల శివ నాగరాజు ఒడుగు రాంబాబు గుంటూరు విజయ కుమారి ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్లూరు కిషోర్ ఎస్ సిఆర్పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెరుకూరి లక్ష్మణరావు కృపారావు మాస్టర్ కంచర్ల జాకబ్ ఈమని వెంకటేశ్వరరావు పి సుబ్బారావు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎల్ తొలి కమిటీ సమావేశం



రేపల్లే, మేజర్‌న్యూస్: అనంతపురం న్యాయవాది బి. వి. శేషాద్రి మరణానికి కారణమైన దోషులపై చట్టప్రకారం చర్యలు తీచుకోవాలని ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ (ఐ ఏ ఎల్)రాష్ట్ర నాయకులు పి. నాగాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఐ ఏ ఎల్ సమావేశం ప్రముఖ న్యాయవాది దారం సాంబశివరావు కార్యాలయం నందు ఎస్.డి.ఎం రబ్బానీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం న్యాయవాది బి. వి. శేషాద్రి మరణానికి కారణమైన దోషలను చట్టప్రకారం చర్యలు తీచుకోవాలి అని అన్నారు. పొన్నూరు న్యాయవాది బండ్ల ప్రకాశరావు పై పెట్టిన ఎఫ్ ఐ ఆర్ ను రద్దు చేయాలని అక్రమంగా కేసు పెట్టిన సి.ఐ, ఎస్.ఐ ముగ్గురు కానిస్టేబులు డాక్టర్ ల పై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గుంటూరు బార్ అసోసియేషన్ రేపల్లె బార్ అసోసియేషన్ ఇచ్చినకార్యక్రమాలలో రేపల్లె ఐ. ఏ.ఎల్ కమిటీ పాల్గొనాలి అని అన్నారు.ఈ సమావేశంలో న్యాయవాదులు మోర్ల కృష్ణారామ్, గురిందపల్లి రామారావు, ఉప్పాల శ్రీనివాసరావు,ఏ సూరిబాబు, ఉప్పాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొనారు.

# మొక్కలకు రసాయనాలు వాడొద్దు: అగ్రికల్చర్ విద్యార్థి మహేష్‌బాబు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఈవీఎల్పి ట్రైనింగ్ లో భాగంగా వివిధ రకాల కూరగాయ మొక్కలను, ఆకుకూర మొక్కలను పెంపుదల చేస్తున్నారు. మొక్కలు పండించాలంటే కేవలం రైతే కానవ సరం లేదు ఇదొక విధము గా కూడా చేయవచ్చని విద్యార్థిని లావణ్య అన్నారు. బీటెక్ చివరి సంవత్సరం సందర్భంగా తమకు ఈ ట్రైనింగ్ జరుగుతుందని విద్యార్థులు తెలిపారు. రైతు ఎప్పుడైతే ఎటువంటి రసాయనాలు కలపకుండా వ్యవసాయం చేస్తాడో అప్పుడు ఎక్కువ మొత్తంలో ఆరోగ్యంతో పాటు లాభం కూడా పొందచ్చని విద్యార్థులు పేర్కొన్నారు. అతి తక్కువ ధరలో తమ కళాశాల నందు ఇండోర్ ప్లాంట్స్ లభిస్తాయని విద్యార్థులు వెల్లడించారు. ఇండోర్ ప్లాంట్స్ పెంపుదల చేయాలనుకున్న వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించవచ్చని విద్యార్థులు తెలియజేశారు. తామంతా ఆరోగ్యంగా జీవించాలంటే ప్రస్తుతం ఉన్న కాలంలో ఎటువంటి రసాయనాలు లేని ఆకు కూరలు తీసుకోవాలని విద్యార్థులు అన్నారు. ఆకుకూరలతో పాటు వివిధ రకాల పూల మొక్కలు, కూరగాయల మొక్కలు తమ వద్ద లభిస్తాయని విద్యార్థులు పేర్కొన్నారు. రైతులకు పొలంలో మొక్కలు కావాలంటే తమ కళాశాల తరపున అతి తక్కువ ధరకు సరఫరా చేస్తామని విద్యార్థులు తెలియజేశారు.

## ధనుర్మాస ఉత్సవాలు 25వ రోజు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల చీలు రోడ్డులో వేంచేసి ఉన్న రుక్మిణీ సమేత పాండురంగ స్వామి వారి దేవాల య ప్రాంగణం నందు ధనుర్మాస ఉత్స వాల్లో భాగంగా 25వ రోజు గోదాదేవి అమ్మవారి పాశురం విష్ణు సహస్రనామం లలితా సహస్రనామం హనుమాన్ చాలీసా కృష్ణాష్టకం గోవింద నామాలు పారాయణ చేశారు. అనంతరం అమ్మవారికి నీరాజనం మంత్రపుష్పాలు విచ్చేసిన భక్తులకి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు.

## ముగ్గుల పోటీలు నిర్వహించిన బండ్రెడ్డి రజిని



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం లోని భావన్నారాయణ స్వామి గుడి పక్క వీధిలో బండ్రెడ్డి రజని ఆధ్వర్యంలో సంక్రాంత్రి పండుగ పురస్కరించుకొని హిందూ సాంప్రదాయాలు పాటిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదట మూడు బహుమతులు గెలుచుకున్న వారికి చీరలు బహుకరించి, పోటీ దారులు అందరికీ ప్రత్యేక బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ మన తెలుగు పండుగలలో పెద్ద పండుగ సంక్రాంత్రి కావున మన సాంప్రధాయాలను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిది అని రజని వివరించి సంక్రాంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడాకారులకు సన్మానం



దర్శి, మేజర్‌న్యూస్: జడ్పీహెచ్ఎస్ చందలూరు నందు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయి, క్రీడాకారులకు, గుర్తింపుగా వారిని సన్మానించి, వారికి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయినటువంటి, గురు ప్రసాద్ చైర్మన్, డి.దేవా వరప్రసాద్, కే.శ్రీనివాస్ రెడ్డి, దర్శి ఎస్ఐ ఎం.మురళి, డాక్టర్ నాయక్, చందలూరు హాస్పటల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు, విద్యార్థులు, వై బ్రెట్లీ, దయాసాగర్, ఆనంద్ కుమార్, ఎస్ పవన్ కుమార్ ఎం.రాకేష్, విద్యార్థులను గౌరవముగా సన్మానించి, వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది ఆనందంగా పాల్గొన్నారు. తరువాత భోగి మంటలను ఎస్ఐ ప్రారంభించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.





## మార్కాపురం తెదేపాలోకి భారీగా చేరికలు

**మొదటి పేజీ తరువాయి** ఇంత మంచి చేస్తున్నా కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో జగన్‌రెడ్డికి ఒక్క అవ కాశం ఇచ్చి మోసపోయారని చెప్పారు. క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలను కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని మంత్రి రవికుమార్ తెలిపారు. అందుకే టీడీపీ పార్టీ కోటి సభ్యత్వాల దిశగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నారాయణ రెడ్డి, అశోక్‌రెడ్డి, దర్శి ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, యర్ర గొండపాలెం ఇంచార్జి ఎరిక్సన్ బాబు, టీడీపీ నాయకులు మన్నే రవీంద్ర పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం
### మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య

చీమకుర్తి, మేజర్‌న్యూస్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు నిమిత్తం నిరుద్యోగులు ఈ నెల 8 నుంచి 16 వ తేదీ వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిష నర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ నుంచి సచివాలయాల్లో ఓబిఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసు కోవాలన్నారు. గొర్రెల పెంపకం,మినీ డైరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా టాటా ఎస్, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. చీమకుర్తి పట్టణానికి సంబంధించి బీసీలకు 20 యూనిట్లు, ఈ డబ్ల్యూ ఎస్‌లకు 7 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాల యంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

## వెంకటాయచెరువులో ఉత్తరద్వార దర్శనం

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో వెంకటాయచెరువు గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పండుగను పురస్కరించుకుని గ్రామస్థులు, గ్రామపెద్దల సహకారంతో శు క్రవారం ఉత్తరద్వారదర్శనం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన ప్రముఖులు మూడికొండయ్య యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా ఉదయం ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటుచేసి స్వామివార్లకు పంచామృత అభిషేకం వివిధ పూజలు నిర్వహించనున్నట్లు అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి జలాభిషేకం, పంచామృత, సింధూర అభిషేకం తమలపాకులతో పూజలు నిర్వహించి స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు మూడికొండయ్యయాదవ్ తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం కాశీనుండి తీసుకువచ్చిన శివలింగానికి ప్రత్యేక అభిషేకం పూజలు జరుగునని అనంతరం భక్తులకు భోజనవితరణ నిర్వహిస్తున్నట్లు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కార్యక్రమాలు గ్రామపెద్దలు గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మూడికొండయ్య యాదవ్ తెలిపారు.

## చీరాల కుప్పడం ప్రదర్శనను తిలకించిన కేంద్ర బృందం



**మొదటి పేజీ తరువాయి** వస్త్రాలను వ్యతిరేకించాలని మహాత్మా గాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల, పేరాల చేనేత కార్మికులు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారని వివరించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందని వివరిం చారు. 16,368 మంది చేనేత కార్మికులు మగ్గాలను ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చేనేత సహకార సంఘాలలో 7,850 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద చీరాల కుప్పడం చీరలను ఎంపిక చేసి అధికారికంగా ప్రకటిస్తే చేనేత కార్మికులను మరింతగా ఆదుకున్నట్లు అవుతుందని చెప్పారు. చేనేత కార్మికులకు కేంద్రం నుంచి రాయితీలు, బహుళ ప్రయోజనాలు కల్పించేలా సహకరించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రతినెల రూ.4 వేలు చొప్పన రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తుందన్నారు. సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న చేనేతలందరికీ వివిధ రాయితీలు కల్పిస్తుందన్నారు. కుటుంబం మొత్తం నిరంతరం కష్టపడి పనిచేసినా వారికి చాలినంత కూలీ రావడంలేదని వివరించారు. కుప్పడం చీర తయారీకి ముగ్గురు వ్యక్తులు కలిసి పని చేయాల్సిందేనని, మూడు రోజులు కష్టపడినా కనీస కూలీ డబ్బులు రావడంలేదని బృందానికి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, జిల్లా సహాయ సంచాలకులు కె.నాగమల్లేశ్వరరావు, డీఓలు వెంకటేశ్వర్లు, చేనేతలు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు: ఎస్పీ దామోదర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: వైకుంఠఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దర్శనం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా గుంపులుగా గుమిగూడటాలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని, ప్రవేశ మార్గము, నిష్క్రమణ ద్వారాల వద్ద బారికేడ్లు, వాహనా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధం గా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని, పార్కింగ్ పాయింట్ల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, భక్తులు తొందరపడి గుంపులు గుంపులుగా దర్శనం కోసం తోపులాటలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాల వద్ద అలంకరణ కోసం కరెంటు వైర్లు వేలాడు విషయంలో దేవాదాయ అధికారులు నిరంతరం పరిశీలన ఉండాలన్నారు. దేవాదాయ, రెవిన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో దేవాలయ ప్రాంగణాలలో బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయాల వద్ద దొంగతనాలు జరుగకుండా అనుమానిత వ్యక్తులపై కూడా నిఘా ఉంచాలని, ఎవరూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకొని, పోలీస్ వారికి సహకరించి ఈ వైకుంఠ ఏకాదశి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## రెవెన్యూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి** పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఆయా సమస్యల తీవ్రతనుబట్టి తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి ప్రధానంగా జాయింట్ ఎల్.పి.ఎం., విస్తీర్ణం, సరిహద్దు వివాదాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నట్లు తాను గుర్తించానన్నారు. ఆయా సమస్యలను సహేతుకంగా పరిష్కరించి ఎండార్స్మెంట్ ఇవ్వాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని, సాంకేతిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె అన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఈ సందర్భంగా అవగాహన కల్పిం చారు. అనంతరం తహసీల్దార్లు లేవనెత్తిన సందేహాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నివృత్తి చేశారు. జిల్లా సర్వేశాఖ సహాయ సంచాకులు గౌస్ భాషా మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన సందేహాలను, లోపాలను సరిచేయ డానికి అవలంబించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. బి.చినఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఒంగోలు ఆర్.డి.ఓ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్.డి.ఓ కేశవర్ధన్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు కుమార్, సత్యనారాయణ, వరకుమార్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరిండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## 9వ రోజు సజావుగా దేహదారుఢ్య పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి** పరీక్షల వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు చేసి భద్రపరస్తున్నట్లు, గ్రౌండ్ లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె. నాగేశ్వరరావు, ఎస్బి డిఎస్పీ సురేష్ బాబు, దర్శి డిఎస్పీ లక్ష్మి నారాయణ, పిటిసి డిఎస్పీ మాధవ రెడ్డి, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏవోరామ్మోహన్ రావు, ఐటి కోర్ సీఐ వి.సూర్యనారాయణ, డీటీసీ సీఐ ఎస్‌కె షమీముల్లా, పిటిసి సిఐ శ్రీనివాసరరావు, ఆర్ఐలు మనోహర్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి,షైక్ ఖాసీం, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలలో ఉత్సహంగా సంక్రాంతి సంబరాలు

వలేటివారిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీరకాయల మాధవరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మరియు సిబ్బంది కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు అందరూ కలిసి భోగిమంటలు వేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## సోలార్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా



తాళ్లూరు, మేజర్‌న్యూస్: తక్కువ ఖర్చుతో ప్రతి ఇంటిపైన సోలార్ ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చుని విద్యుత్ శాఖ దర్శి డివిజన్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలోని గుజ్జుల మణికంఠ యోగాలయంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్ పథకం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రాయితీపై 1 కిలో వాట్స్ యూనిట్‌కి రూ.30 వేలు, 2కిలో వాట్స్ యూనిట్‌కి రూ.60వేలు, 3 కిలోవాట్స్ యూనిట్ పైన వాటికి 78వేలు రాయితీ ఇస్తోందన్నారు. మొత్తం విలువ రూ.2 లక్షలు ఉంటుందని అన్నారు. రాయితీపై వచ్చే ఈ పథకం కావాల్సిన వారు స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని లేదా పీఎం సూర్యఘర్ వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ఈ పథకంపై సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ,ఏఈ వీ.శ్రీనివాసరావు, ఎల్ఐ వీవీఎస్ కాంతారావు, లైన్ మెన్ నారాయణ యూనియన్ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నివేదిత హైస్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఇంకొల్లు, మేజర్‌న్యూస్: మండలంలోని ఇంకొల్లు నివేదిత ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, ఎకడమిక్ డైరెక్టర్ వై సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు చేశారు.

చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. బొమ్మల కొలువు ఏర్పాటుచేసి దాని చుట్టూ రంగవల్లులు తో అలంకరించారు. డోలు సన్నాయి మోగిస్తూ హరిదాసుల వేషధారణలో చిన్నారులు చేసిన అభినయం అందరిని ఆకట్టుకుంది. భోగి మంటలు వేసి దాని చుట్టూ చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులకు భోగి పళ్ళు పోసి భోగి వేడుక జరిపారు. గాలిపటాలు ఎగురవేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను, మనసంస్కృతి సాంప్రదా యాలను విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, ఎకడమిక్ డైరెక్టర్ వై సుబ్బరామిరెడ్డి చిన్నారులకు తెలిపారు. చిన్నారులు వేసిన నత్యాలు పలువురిని అలరించాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్స్ రేణుక, చైతన్య, రజిని, అనురాధ, ఉమా తేజ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన జనసేన నాయకులు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: విజయవాడ నగరం తూర్పునియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ను మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన మండల జనసేన నాయకులు గూడంశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసిన గూడంశెట్టి రవికుమార్ మిత్రబృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమపాలనపై ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపి అభివృద్ధి సంక్షేమం టిడిపి కూటమి ప్రభుత్వంతో సాధ్యమని ప్రజలలో నమ్మకం ఏర్పడినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసిన వారిలో గూడంశెట్టి రవికుమార్, టి.ప్రేమ్ నాయుడు, రేనాటిశుభం, జిలకర సూరిరెడ్డి తదితరులు ఉన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



పామూరు, మేజర్‌న్యూస్: క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ఆరోగ్యానికి దోహద పడతాయని తెలుగుదేశం పార్టీ పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉగ్రన్న యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను గురువారం పట్టణంలో ప్రారంభించారు. బొల్లా మాల్యాద్రి చౌదరి జ్ఞాపకార్థం గుమ్మలంపాడులో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. పువ్వాడి వెంకటేశ్వర్లు క్రీడాకారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు యారవ శ్రీనివాసులు, టిడిపి కూటమి నేతలు పందిటి హరీష్, దారపనేని కొండబాబు, షేక్ కాజా రంతుల్లా, ఎలమందల రహీ ముల్లా, బద్దిపూడి మార్క్, సందాని, దేవరపు మాల్యాద్రి, డేగ నాగరాజు, పారా వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సముద్ర తీరం సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయాలి



బాపట్ల మేజర్ న్యూస్: సూర్యలంక బీచ్ ని సర్వాంగ సుందరంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. బాపట్ల సూర్యలంక బీచ్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యలంక బీచ్ కి రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని అన్నారు. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడానికి, సముద్ర స్థానాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారని అన్నారు. బీచ్ ని అభివృద్ధి పరిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.బీచ్ ని పచ్చదనంతో, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు.బీచ్ లో ఎకరానికి 160 మొక్కలు చొప్పున 7 ఎకరాల్లో 1120 కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. మొక్కలు నాటడానికి రూ 10 లక్షల నిధులు ఖర్చు చేస్తున్నామని అన్నారు. అంత మాత్రమే కాకుండా మొక్కలను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.గ్లోరియా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ ఫర్నీచర్ షాపును ప్రారంభించిన దామచర్ల సత్య



టంగుటూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని టంగుటూరు ట్రంకు రోడ్డులో గురువారం బాలాజీ ఫర్నిచర్, హెూమ్ నీడ్స్ షాపును ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ షాపు యజమాని శ్రీహరికు అభినందనలు తెలియజేస్తూ షాపు ప్రజల చేత ఆదరణ పొందుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కామని విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు, టిడిపి నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కిన హరిబాబు, జమ్ములపాలెం టిడిపి నాయకులు వెంకటరావు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తుకు ఆదేశాలిచ్చిన ఎస్పీ



బాపట్ల, మేజర్‌న్యూస్: ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా దేవాలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా తీసుకోవలసిన ముందస్తు భద్రత చర్యల గురించి జిల్లా ఎస్పీ గురువారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంటుందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంచనీయ ఘటన లు చోటుచేసుకోకుండా శుక్రవారం వేకువ జాము నుండే దేవాలయాల వద్ద, పరిసర ప్రాంతాలలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. భక్తులు తాకిడి అధికంగా ఉన్న దేవాలయాల వద్ద బ్యారికేడింగ్ ఏర్పాటు చేసుకొవాలన్నారు. భక్తులు తప్పని సరిగా క్యూ లైన్ పాటిం చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లు జరగకుండా నిఘా ఉంచాలని సూచించారు. దేవాదాయ శాఖ అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులతో సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు కావలసిన సౌకర్యాలను కల్పించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. భక్తి శ్రద్ధలతో దేవాలయాలకు వచ్చు భక్తులు పోలీస్ శాఖ సూచనలు పాటించాలని ఎస్పీ సూచించారు. ఒకరికొకరు తోపులాడుకోకుండా క్యూ పద్దతి పాటిస్తూ దైవ దర్శనం చేసుకోవాలని తెలిపారు. సహజంగా దేవాలయాలకు వచ్చే మహిళలు బంగారు ఆభరణాలు ధరించి వస్తుంటారని వారు అప్రమత్తంగా ఉండాల న్నారు. దేవాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటన లు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

# మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కర్లపాలెం, మేజర్ న్యూస్.మహిళా సంఘాల సుస్థిర జీవనోపాదుల అభివృద్ధి నేటి ప్రభుత్వలక్ష్యమని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరెంద్రవర్మరాజు అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యములో బ్యాంకర్ల సమన్వయంతో ఆర్థిక స్వావలంబన ఋణ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా శాసనసభ్యులు పాల్గొని నూతన సంవత్సర సంక్రాంతి కేక్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలనే ప్రదాన లక్ష్యముగా డ్వాక్రా సంఘాల విస్తరించి వారి ఆదాయం పెంచే విధంగా పనిచేస్తున్నారన్నారు. నిరుపేద మహిళలను గుర్తించి వ్యవసాయం, వ్యవసాయేతరం రంగాలలో ఉన్న జీవనోపాధిని మెరుగుపరచడం, కొత్త జీవనోపాధిని గుర్తించడం, మిశ్రమ జీవనోపాధికి ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి ,వ్యాపారం ,సేవలు లాంటి కార్యక్రమాలపై ఆసక్తి కల్గించి అవసరమైన ఆర్థిక నిధులు సమకుర్చుకోనుటకు బ్యాంకు ,ఇతర ప్రభుత్వ సంస్థలను అనుసందానము చేసి ప్రతి మహిళా వ్యాపార ,సాంకేతిక ఉత్పత్తి ,సేవరంగాలలో ముందుండే విదముగా తీర్చిదిద్దటమే ప్రదాన లక్ష్యంగా పనిచేసి ప్రభుత్వ కల నిజంచేసి ప్రతి మహిళా లక్షాధికారి కావాలని వివరించారు . బ్యాంకు ఋణము 43 సంఘాలకు 7.47 కోట్లు లఖ్ పతి దిది జీవనోపాది రుణాలు 110 మందికి 1.20 కోట్లు స్త్రినిది రుణాలు 150 మంది సభ్యులకు 1.50 కోట్లు మొత్తము 10.17 కోట్ల నమోనా చెక్కులను మహిళలకు అందజేశారు .ఈ కార్యక్రమం అనతరం లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ బ్యాంకు మేనేజర్ లు యూనియన్ బ్యాంకు మానస ,సి.జి.జి.బి బ్యాంకు మురళీ కృష్ణ ఇండియన్ బ్యాంకు రత్నజ్యోతి లకు శాసనసభ్యులు దుసాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.ఓ కే.వి.బి.టి సుందరమ్మ ఎం.పి.డి.ఓ అద్దురి శ్రీనివాసరావు ఏ.పి.ఎం శ్రీనివాసులు రెడ్డి మండలసమాఖ్య ప్రతినిధులు ,పార్లమెంటు సమన్వయకర్త నక్కల వెంకట స్వామీ .మండల పార్టీ అద్యక్షులు ఏపూరి భూపతిరావు,జనసేన నాయకులు శ్రీకృష్ణ ,మహిళా పార్టీ అధ్యక్షురాలు సునీత ,ఉప సర్పంచ్ పఠాన్ ఆహ్మాద్ బాష,సిబ్బంది శివకోటేశ్వరరావు ,రాఘవ ,అకౌంటేంట్ లక్ష్మి వి.ఓ.ఎ లు మహిళలు పాల్గొన్నారు .

# కాలువల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: వేమురు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పంట కాల్వల మరమ్మత్తులు, డ్రైనేజీ కాల్వల మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్,డ్రైనేజ్ శాఖ ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ పనులు జరుగుతున్న తీరుతేన్నులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కాల్వల మరమ్మతులు చేయక సాగునీరు సక్రమంగా సరఫరా కాలేదని చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు గురయ్యార న్నారు.అటువంటి పరిస్థితులు తిరిగి తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు కాల్వల మరమ్మత్తుల పనులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. నిధులకు సంబంధించి కొరత ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు సమకూర్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కాల్వల పనుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలిపారు . సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ మరియు డ్రైనేజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనం



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల లోని పలు ఆలయాల్లో శుక్రవారం స్వామివార్లను భక్తులు ఉత్తర ముఖంగా దర్శించుకోవడానికి నిర్వాహ కులు భారీ ఏర్పాట్లు చేశారు.పరమ పవిత్రమైన ఈ రోజు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే జన్మ,జన్మల పాపాలు తొలగిపోయి పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయని ప్రతీతి. ఏకాదశి రోజున విష్ణు దర్శనం తర్వాత పూజలు చేసి ఉపవాసం ఉండటం ద్వారా అఖండ ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. స్థానిక రథంసెంటర్ వద్ద గల శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానం వద్ద ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు.తెల్లవారుజామున 5 గం లకు ఉత్తర ద్వార దర్శనం,8 గం కు గ్రామోత్సవం,10 గం లకు సంక్షిప్త భాగవద్గీత,విష్ణు సహస్రనామ పారాయణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కూడా ఉత్తర ద్వార దర్శనం,ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్పెసిఫిక్ ఎండోమెంట్ వంశపారంపర్య ఫౌండర్ ట్రస్టులు మానేపల్లి రఘునాథ బాబు పార్వతి శంకర సాయి మానేపల్లి శైలజ కుమారి,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# తిరుమలనాధస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామపంచాయతీ పరిధిలో తిరుమలకొండపై వెలసిన అతిపురాతన మహిమాన్విత శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాధస్వామి దేవస్థానం నందు శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటు చేసి ఉదయం కళశప్రతిష్ఠ, పంచామృత అభిషేకం పూజలు నిర్వహించి అనంతరం పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేసి విశేషపూజలను నిర్వహించి అనంతరం భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు భోజనవితరణ సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాధస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు మండల పరిసర ప్రాంత ప్రజలు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగలరని నిర్వాహకులు తెలిపారు.

# పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

## చీరాల టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరు మహేంద్ర నాథ్



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని జిల్లాపరిషత్ హైస్కూల్ పందిళ్ళపల్లికి గురువారం చీరాల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్, చీరాల డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావు విజిట్ చేయడం జరిగింది. మహేంద్ర నాథ్ ముఖ్యంగా పాఠశాలలో ఉన్న క్రీడా వికాస కేంద్రం, నిర్మాణం మధ్యలో ఆగిపోయిన పాఠశాలకు ఆదనపు తరగతి గదులు, ఎన్నిసార్లు రిపేర్ చేసినా పనిచేయని ఆర్వో ప్లాంట్ పరిశీలించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన ఏ సమస్య అయినా సరే సత్వరమే డైరెక్టుగా ప్రధానోపాధ్యాయులే నా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని తప్పనిసరిగా పరిష్కరిస్తానని, క్రీడా వికాస కేంద్రం త్వరలో ప్రారంభించడానికి, ఆదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయడానికి, ఆర్వో ప్లాంట్ పనిచేసే విధంగా చర్యలు తప్పకుండా తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాండ్రూస్ అకాడమీ ఆన్లైన్లో గత నవంబర్లో నిర్వహించిన మాథ్స్ ఒలింపియాడ్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన ఏడవ తరగతి చదువుచున్న పృథివి షణ్ముఖేశ్వర్‌కి రూ.2000 నగదు బహుమతి, మెమెంటో, మెడల్, సర్టిఫికేటు, 8వతరగతి చదువుతున్న బట్ట లలితసాయి విగ్నేష్ రాష్ట్రస్థాయిలో మాథ్స్ ఒలంపియాడ్లో ద్వితీయ స్థానం సాధించినందుకు వెయ్యి రూపాయల నగదు బహుమతి, మెమెంటో, మెడల్, సర్టిఫికెట్ మహేంద్ర నాథ్ చేతుల మీదుగా అందించారు.

ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, ఓల్డ్‌స్టూడెంట్ సొసైటీ అధ్యక్షులు ఊటుకూరు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రొండా దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదవాలి: ఎమ్మెల్యే కందుల



మార్కాపురం, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని రాక్ వెల్ పబ్లిక్ స్కూల్, సాయి బాలాజీ హైస్కూల్‌లలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా స్కూళ్లలోని ఉపాధ్యాయులకు విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రాక్ వెల్ పబ్లిక్ స్కూల్లో మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో ఎన్నో వ్యయ ప్రయాసలు కూర్చి ఈ స్కూల్‌ను నిర్మించి నడపడం ఈ స్కూల్ యాజమాన్యం పట్టుదలను తెలియజేస్తుందని, స్కూల్లో సీబీఎస్సీ కరికులం సిలబస్ బోధించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అనంతరం సాయి బాలాజీ హైస్కూల్‌లో మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి కొన్ని వేలమంది విద్యార్థులకు విద్యను బోధించడం అభినందనీయమని అన్నారు. ఒకప్పుడు పట్టణానికి దూరంగా ఉండే స్కూల్ ఇప్పుడు దాదాపు 1700మంది విద్యార్థులతో నడపడం సంతోషమని అన్నారు. త్వరలోనే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధిస్తామని, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని డెల్టా మాదిరిగా మారుస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా స్కూల్స్ విద్యార్థులు ఉపాధ్యాయులు యాజమాన్యం పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు



కందుకూరురూరల్, మేజర్‌న్యూస్: ముక్కోటి ఏకాదశి సందర్బంగా పట్టణంలోని శ్రీ స్కందపురి జనార్ధన స్వామి వారి దేవస్థానంలో ఈనెల 10తేది శుక్రవారం ఉదయం ఐదు గంటల నుండి శ్రీ స్వామివారు తూర్పు రాజగోపురము ద్వారము నందు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. కావున భక్త మహాశయులందరూ స్వామివారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించాలన్నారు.

# ఇద్దరు మోసగాళ్ళు అరెస్టు



- రూ.8 లక్షలు నగదు స్వాధీనం
- మీడియాతో ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు, మేజర్‌న్యూస్ : క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడి మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసి రూ 8 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు తెలియజేశారు. ఒంగోలు రూరల్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. నాగులుప్పలపాడు మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలోని కొణిజేటి సురేష్ బాబు అను అతను శనగల వ్యాపారి. నేరస్తులు అతని మేనల్లుడులాగా ఫోన్లో మాట్లాడి అతనిని నమ్మించి, వారు ప్రేవేట్ కంపెనీ పెడుతున్నట్లు దానికి డబ్బులు అవసరమని ఇస్తే తిరిగి ఇస్తామని నమ్మించి మోసం చేసి అతని వద్ద నుంచి పలు మార్లు ఫోన్ ఫే ద్వారా రూ 8,34,000 మని ట్రాన్సాక్షన్ పాయింట్‌కు ఆన్లైన్‌లో నగదు బదిలీ చేయించి తరువాత ఆ డబ్బులను డ్రా చేసుకున్నారు.

సదరు పిర్యాదుపై నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయబడి దర్యాప్తులో ఉంది. ఎస్పీ పర్యవేక్షణలో ఒంగోలు ఎస్‌డిపిఓ రాయపాటి శ్రీనివాసరావు నిర్దేశంలో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీకాంత్ బాబు, వారి సిబ్బంది నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, వారి బృందంలో ముద్దాయిలను అరెస్టు చేశారు. కోట విజయకృష్ణ (32) కొప్పరపాలెం గ్రామం, బల్లికురవ మండలం, చిక్కాల డొమ్నిక్ చక్రవర్తి (19) సాలినగర్, నరసరాపేట మండలం, పల్నాడు జిల్లాగా గుర్తించారు. రూ.8లక్షల నగదను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. కేసులో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, నాగులుప్పలపాడు, పి.రాఘవులు, డి. తిరుపతిరెడ్డి, ఎస్. రవి కుమార్ రెడ్డి తదితర సిబ్బందికి ప్రత్యేకంగా అభినందించారు.

# దీన దయాల్ స్పర్శ యోజనలో కొండ మంజులూరు విద్యార్థుల ప్రతిభ

## ఆరుగురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు ఎంపిక




పంగులూరు, మేజర్ న్యూస్: భారత తపాలా శాఖ వారు నిర్వహించే దీన దయాల్ స్పర్శ యోజన -ప్రతిభ అన్వేషణ పరీక్షలో కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభను ఘనపరిచి స్కాలర్షిప్లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. రాష్ట్రస్థాయిలో 40 మంది విద్యార్థులు ఈ స్కాలర్షిప్లకు ఎంపిక కాగా, ఒక కొండ మంజులూరు పాఠశాలల నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపికవటం హర్షనీయ విషయమని ఆమె అన్నారు. ఇందులో విజేతలైన విద్యార్థులకు ఒక్కొక్కరికి 6000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ అందుతుందని ఆమె తెలిపారు. కొండ మంజులూరు పాఠశాల నుండి ఎంపికైన విద్యార్థులలో చేతరాజు పల్లి పవన్ గోపికృష్ణ, గుడిపాటి పూజా లోహిత, అమర అలేఖ్య, సంపంగల ప్రదీప్తి, చొప్పరపు లాస్య, ఎండ్లూరి వర్షశ్రీలు ఉన్నారు. మొదట ఈ పరీక్షకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి హాజరైన విద్యార్థులలో కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 24 మంది బాలబాలికలు ప్రాథమిక స్థాయిలో ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపకార వేదాలు పొందటం అభినందనీయమని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి బి.పురుషోత్తం, ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, పంగులూరు మండలం విద్యాశాఖ అధికారులు నాగభూషణం, వీరాంజనేయులు విద్యార్థులను అభినందించారు.

## నేడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: నేడు దోర్నాల మండలంలో పర్యటించనున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన ఏర్పాట్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. మోట్ల మల్లికార్జునపురం వద్ద గిరిజన గూడెల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మౌలిక వసతులను మంత్రి పర్యవేక్షించనున్నారు. అనంతరం చెంచు గిరిజనులతో మాటామంతి కార్యక్రమం దోర్నాలలో గోకుల షెడ్డును ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి, జనసేన కన్వీనర్ కేతి వెంకట మురళి, బట్టు సుధాకర్ రెడ్డి, లాయర్ కాశయ్య, ఈదర మల్లయ్య, కొప్పుల సుబ్బారెడ్డి, దొడ్డ శేషాద్రి, చంటి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీచైతన్య హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

టంగుటూరు, మేజర్‌న్యూస్: టంగుటూరులోని శ్రీ చైతన్య హైస్కూల్ వద్ద గురువారం కరస్పాండెంట్ వివి రమణ, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.వెంకాయమ్మ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు నూతన వస్త్రములు ధరించుకొని భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థినిలు వివిధ రంగవల్లికలు చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాయంత్రం విద్యార్థులు గాలిపటాలను ఎగరవేసి సంక్రాంతి సంబరాలను కన్నుల పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వివి రమణ, ప్రధానోపాధ్యాయురాలు యన్.వెంకాయమ్మ, అకడమిక్ డైరెక్టర్ రాజనర్సింహ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖోఖో వరల్డ్‌కప్‌కు ఎంపికైన ఎస్ఆర్ఆర్ అకాడమి క్రీడాకారుడు శివారెడ్డి




పంగులూరు, మేజర్‌న్యూస్: ఢిల్లీలో జరగబోయే మొట్టమొదటి ఖో ఖో వరల్డ్ కప్‌కు గురువారం మెయిన్ సెలక్షన్ జరగగా మన రాష్ట్రానికి చెందిన ఎస్ ఆర్ ఆర్ ఖో ఖో అకాడమీ క్రీడాకారుడు ఇండి యన్ పోస్టల్ ఉద్యోగి శివారెడ్డి ఎంపిక అయ్యాడని రాష్ట్ర ఖో ఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాళ్ల ద్వారా ఫైనల్ టీంను 9 జనవరి ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మన రాష్ట్రం నుండి ఒక క్రీడాకారుడు వరల్డ్ కప్ వరకు సెలెక్ట్ అవ్వడం పట్ల పలు వురు ప్రముఖుల అభినందనలు తెలిపారు. తన అభివృద్ధికి కృషి చేసిన పిడి సీతారామిరెడ్డి, అండగా నిలిచిన యావత్ ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ పెద్దలం దరికీ శివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వెంకటసాయి మల్టీసర్వీసెస్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కందుకూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని మునిసిపల్ ఆఫీస్ రోడ్‌లో వెంకట సాయి మల్టీ సర్వీసెస్ నూతన షాప్‌ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వహకులు ఎండ్లూరి కాంతారావుకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బద్దిపూడి శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ కుడికాలువ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి



దర్శి, మేజర్‌న్యూస్: నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని దర్శి డిసి మోదేపల్లి డిసి కంచుమాటి శ్రీనివాసరావు, రామచంద్రపురం సాగు నీటి సంఘము అధ్యక్షులు మానుకొండ మల్లిఖార్జున రావు కోరారు. సత్తెనపల్లిలో గురువారం సాగర్ ఆయకట్టు పరిధిలోని డిసి అధ్యక్షులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ డిసిలు, సాగు నీటి సంఘము అధ్యక్షులు తెల్పిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. సిబ్బంది కొరత లేకుండా చేస్తామని తెలిపారు. అనంతరం చైర్మన్ కాంతారావును దర్శి డిసి అధ్యక్షులు కామిరెడ్డి వెలుగొండ రెడ్డి, మోదేపల్లి డిసి కంచుమాటి శ్రీనివాసరావు, రామచంద్రపురం నీటి సంఘము అధ్యక్షులు మానుకొండ మల్లిఖార్జున రావు ఘనంగా సన్మానించారు.

## నరేంద్ర మోడీకి ధన్యవాదాలు



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ దోర్నాల-కుంట జాతీయ రహదారిని 245 కోట్ల వ్యాయంతో నిర్మించ తలపెట్టినందుకు దోర్నాల ప్రజలు తరపున భారతీయ జనతా పార్టీ యువజన విభాగం కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ తంగిరాల అశోక్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ హైవేకి సంబంధించి ఇప్పటికే శరవేగంగా పనులు జరుగుతున్నాయి దేశ అభివృద్ధితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని విశాఖపట్నంలో జరిగిన సభలో మోడీ చెప్పడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంతోషిస్తున్నారు.

## చందోలు ఆలయాల హుండీ లెక్కింపు



పిట్టల వాని పాలెం, మేజర్‌న్యూస్: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం, శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవస్థానలలో గురువారం దేవాదాయ శాఖ అధికారులు అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీలు లెక్కించగా ఈ క్రింది విధముగా ఆదాయము వచ్చి ఉన్నవి. శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవస్థానములో ఒక సంవత్సరానికి గాను రూ 34,586/-, శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో ఒక సంవత్సరానికి రూ.. 15,659/- శ్రీ బండ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో 6 నెలలకు గాను రూ 7,29,180/- రూ నగదు ఆదాయం లభించినది అని తెలియజేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి జి నరసింహమూర్తి. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఎండోమెంట్ బాపట్ల డివిజన్ ఇన్స్పెక్టర్ ఎం గోపి, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు పొన్నూరు బ్రాంచ్ మేనేజర్ కె రాజేష్, డి సతీష్, పంచాయతీ కార్యదర్శి బండ్లమూడి సుజాత, చందోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పి సాంబశివరావు, ఏ కొండల్ రెడ్డి, ఏ బి మాధవి ఆలయ అర్చకులు దండి భట్ల వెంకటసుబ్బయ్య, శ్రీనివాసు, వేదాంతం వరదాచార్యులు, కుంచెల నరసారెడ్డి, చందోలు,బాపట్ల, కుంచలవారిపాలెం గ్రామ భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురంలోని బెల్లంకొండ విద్యామందిర్ ఉన్నత పాఠశాల నందు గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, విచిత్ర వేషధారణ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రత్నం విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందజేశారు.

# సంక్రాంత్రి సంబరాల కరపత్రిక ఆవిష్కరణ



దర్శి, మేజర్‌న్యూస్: సంక్రాంత్రి సంబరాలలో భాగంగా దర్శి వెలమవారి వీధిలో ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఐటియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.హనుమంతరావు, బికేఎంయు నాయకులు జె.కోటేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ అద్దంకి రోడ్డులోని శివశంకర్ థియేటర్ ఎదురువెలమ వారి వీధిలో ఈనెల 14వ తేదీ సంక్రాంతి పండగ రోజు ఏఐటియుసి బికెయంయు ఆధ్వర్యంలో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించుచున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోటం శెట్టి హనుమంతరావు, బికేఎంయు రాష్ట్ర నాయకుడు జూపల్లి కోటేశ్వరావు తెలిపారు. గురువారం స్థానిక గుజ్జుల సరళాదేవి భవనంలో సమావేశం నిర్వహించి అనంతరం ఆటల ముగ్గుల పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు, కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సైకిల్ స్లో, లెమన్ అండ్ స్పూను, గోతాల దూకుళ్ళు సాయంత్రం మూడు గంటలకు కుర్చీలాట, మూడున్నర గంటలకు రంగవల్లి ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, రంగులు అనుమతించేది లేదని, తెల్లముగ్గుతోనే చుక్కలతో ముగ్గు వెయ్యాలన్నారు. ఎంట్రీ ఫీజు ఆటల పోటీలకు పది రూపాయలు, ముగ్గుల పోటీలకు 20 రూపాయలు చెల్లించాలని కోరారు. సమాచారం కొరకు 8184980338, 9059993480 ఈ నెంబర్లను సంప్రదించాలని హనుమంతరావు, కోటేశ్వరావులు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు, జూపల్లి శ్రీనివాసరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికా విద్యను ప్రోత్సహించడమే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సంకల్పం



అద్దంకి, మేజర్‌న్యూస్: బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రగతి విద్యాజ్యోతి ఉపకార వేతనాలు' అందిస్తున్నట్లు అద్దంకిశాఖా చీఫ్ మేనేజర్ ఈ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గతేడాది 6, 7, 8 తరగతుల్లో అత్యధికమార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులను ఎంపిక చేసి, వారికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున 15 వేల రూపాయలు అందించారు. ఈసందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యాంక్ మేనేజరు మాట్లాడుతూ ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అన్నానుడిని నిజం చేస్తూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నారు. తద్వారా కుటుంబ ఆర్థిక ప్రగతి మెరుగుపడుతుందని వివరించారు.ఏడాదికి ఒక పాఠశాలను ఎంపిక చేసి ఉత్తమ ప్రతిభ గల ముగ్గురు విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు తేజస్విని, అంకం జెస్సీ గ్రేస్, కొలకలూరి ఏంజెల్ జాయ్స్ లకు రూ.5వేల చొప్పున మొత్తం రూ.15 వేల నగదు బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల వద్ద జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు



అద్దంకి, మేజర్‌న్యూస్: భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రాధాన్యమైన పండుగ "సంక్రాంతి" అని పాఠశాల ప్రిన్సిపాల్ కాట్రగడ్డ రవీంద్రబాబు అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల నందు ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు గురువారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాషా సంస్కృతిక శాఖ ఆంధ్రప్రదేశ్ వారి సహకారంతో కోలాటం ప్రదర్శించిన 40 మంది విద్యార్థిని విద్యార్థులకు ఐ ఈ ఈ ఆర్ డి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ బత్తుల కిరణ్ చంద్ బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ రవీంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రాధాన్యం ఉన్నదన్నారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సందర్భంలో జరుపుకునే పండుగ అని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో జరుపుకుంటారని అన్నారు. అంతరించిపోతున్న కళలు, సాంప్రదాయాలు, సంస్కృతిని పెంపొందించి మన భారతీయ సంస్కృతిని విద్యార్థిని విద్యార్థులు యొక్క తల్లిదండ్రులు చిన్ననాటినుండి ఆలంబించుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకలో వైస్ ప్రిన్సిపాల్ అంజుమ్, సి బ్యాచ్ ఇంచార్జ్ గిరి, పి ఈ టి మీరావలి, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు మండలాల భాజపా అధ్యక్షుల ఎంపిక



అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు భాజపా అధ్యక్షుల ఎంపిక ఏకగ్రీవమైంది. బంగ్లారోడ్డు నందు గల మౌర్య-మెడికల్ షాప్ వద్ద గురువారం ఉదయం సమావేశం జరిగింది. అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు మండలాల అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా యడ్లపాటి స్వరూపరాణి, రాంపల్లి జగన్నాథశాస్త్రి హాజరయ్యారు. అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల అధ్యక్షులుగా ఈదా శ్రీనివాసరెడ్డి, గుడిమెట్ల అశోక్, నార్నె రత్తయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేస్తూ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ కొండముది బంగారుబాబు, పరుచూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి యల్లమందరావు, సాతులూరి నారాయణ, సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, కాలేషాబాబు తదితరులు పాల్గొన్నారు.

## 11న వడ్డె ఓబన్న జయంతికి సెలవుపై హర్షం




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా జనవరి 11వ తేది ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించినందున గురువారం స్థానిక మండల టిడిపి నాయకులు వడ్డెరలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు(వెంగయ్య) ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు వెనుకబడిన తరగతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి వారిని అన్నిరంగాల్లో రాణించే విధంగా గుర్తింపు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని వడ్డెరల ఆరాధ్యం వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించడం బిసివర్గాలపై చంద్రబాబునాయుడుకు ఉన్న అభిమానం నిదర్శనమని తెలిపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ వెంగయ్య, సర్పంచులు శ్రీరాంపద్మావతి, కామనబోయిన ఆర్.వెంకటస్వామి, నాయకులు యన్.సి.మాలకొండయ్య, జె.లక్ష్మీదేవి, ఏ.రామకృష్ణంరాజు, బత్తులవెంకటాద్రి, దేవండ్ల తిరపతయ్య, బండారు వెంకటరామయ్య, ఓర్చు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, బి.తిరపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు




నగరం, మేజర్ న్యూస్ : ముగ్గుల పోటీలు సంక్రాంతి శోభకు మరింత వన్నెతెస్తాయని స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎడి వి. వెంకటేశ్వరరావు, ఫిజిక్స్ శాఖాధిపతి డాక్టర్ పి. శ్రీనివాసరావు, జి. అనూరాధ, బి. అనూరాధ, ఎ. కోకిల, ఎ. శ్రీదేవి, ఎస్.అనూష, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ముగ్గుల పోటీలు



నగరం, మేజర్‌న్యూస్: పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సంక్రాంతి పండుగ ఎంతో ఉపయోగపడుతుందని మండల పరిధిలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. బదరీనారాయణ అన్నారు. గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలను విద్యార్థులు ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. తొలుత ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హరేరాం, ఎస్ఎంసి చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయులు అనురాధ, నెహ్రూ, రాఘవయ్య, సుదర్శన్, రమేష్, రాజ్యలక్ష్మి, భాస్కరరావు, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుట్కా ప్యాకెట్స్ దగ్ధం చేసిన పోలీసులు



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పలు ప్రాంతాలలోని దుకాణాలు, నివాసాలలో పట్టుబడిన రూ.7,36,875లు విలువ కలిగిన గుట్కా, ఖైని ప్యాకెట్లను పోలీసులు గురువారం మంటల్లో కాల్చి బూడిద చేశారు. చీరాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నుండి దండుబాట రోడ్‌లోని నల్లకట్ట కాలువ వద్దకు టాటా ఏసీ వాహనంలో తరలించి గుట్కా ప్యాకెట్లను ఎమ్మార్వో గోపికృష్ణ సమక్షంలో చీరాల వన్ టౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది తగలబెట్టారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 2019 సంవత్సరంలో పట్టుబడిన అప్పటి నిషేధత గుట్కా ప్యాకెట్స్‌ను గురువారం తగలబెట్టడం జరిగిందని వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సబ్ కలెక్టర్ స్థల పరిశీలన



పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గురు మార్కాపురం సబ్ వెంకట వెంకట రవి స్థానిక మార్కెట్ యార్డులో కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తగు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. జిల్లా ఏడి ఉపేంద్ర కుమార్, తాసిల్దార్ కిన్నెరశాంతి, మండల సర్వే సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## పిల్లలకు ఆధార్ నమోదు శిబిరం



తాళ్లూరు, మేజర్‌న్యూస్: బంగారు బాల్యంలో భాగంగా 0 నుండి 6 సంవత్సరాలకు పిల్లలకు ఆధార్ తీయుటకు స్పెషల్ క్యాంపులు నిర్వహించడం జరిగినది. మండలంలో వెలుగు వారి పాలెం, ఈస్ట్ గంగవరం మన్నేపల్లి సచివాలయాలలో 8వ తేదీ నుండి క్యాంపులు నిర్వహించడం జరుగుతున్నది. ఈ క్యాంపులో ఇప్పటివరకు మొత్తం 86 మందికి ఆధార్ తీయటం జరిగినదని సూపర్వైజర్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంను సిడిపిఓ సిహెచ్ భారతి, సూపర్వైజర్ జి.జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని ఉమ్మారెడ్డిపల్లి గ్రామంలోని తాగునీటి అవసరాల కోసం ఏర్పాటుచేసిన బోర్ల ట్రాన్స్ఫారంలోని రాగి తీగను, అలాగే కారుమాను పల్లి గ్రామంలో పొలానికి అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫారంలోని కాపర్ వైర్లు ట్రాన్స్ఫారం పైనుంచి కిందకు దింపి విడిభాగాలు చేసి కాపర్ వైరును దొంగిలించి తీసుకెళ్లినట్టు రైతులు విద్యుత్ అధికారులకు తెలియచేశారు. విద్యుత్ అధికారులు పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## బధిరుల పాఠశాలలో అన్నదానం

చీమకుర్తి, మేజరన్యూస్: పట్టణంలోని ఎస్.కె. ఆర్. బధిరుల పాఠశాలలో గురువారం అన్నదానం కార్యక్రమం చీమకుర్తి, సాయిబాబా మందిరం వారి ఆధ్వర్యంలో జరిగింది. సాయి పాదసేవకులు పత్తి. ఆంజనేయులు, ధనలక్ష్మి, అమృత, యమా వెంకటేష్, వెంకట వర్షిత, తోట వంశీ రంజన్ బాబు, వెంకట హర్షిత గార్లు గురువారం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిబాబా మందిరం ట్రస్ట్ సభ్యులు మావిల్లపల్లి. వెంకటేశ్వర్లు, చదలపాక. ప్రసాదరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. అంజిరెడ్డి, సాయిబాబా దేవస్థానం అర్చకులు వి. వెంకటాచార్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

కందుకూరురూరల్, మేజర్‌న్యూస్: ఓగూరు సిద్ధార్థ ఉన్నత పాఠశాలలలో పాఠశాల కరస్పాండెంట్ జి రామారావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు రంగ వల్లులను చక్కగా తీర్చిదిద్దారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గాలిపటాల ఎగరవేయటం, పొంగళ్ళు పెట్టడం, విద్యార్థులు వివిధ వేషధారణతో చక్కగా అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి రామారావు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని అందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఈ నూతన సంవత్సరము అందరి జీవితాల్లో పండుగ వెలుగులు రావాలని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు రాబోయే 2025 పబ్లిక్ పరీక్షల్లో అద్భుతంగా రాణించాలని కోరుకున్నారు.



ఈ కార్యక్ర మంలో ఓగూరు పాఠశాల ఇంచార్జ్ ప్రసాద్ ప్రధానో పాధ్యాయులు హరిబాబు, బాబురావు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: మిరియం



ఉలవపాడు, మేజర్‌న్యూస్: ఈనెల 8 తేదీ తిరుమలలో దేవుని దర్శనం కోసం వెళ్లి తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబానికి కోటి రూపాయలు, ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులకు 25లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లిం చాలని కరేడు మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించలేనివారు వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోట్ల డబ్బు కలిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తుల ప్రాణాలతో చెలగాటం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు మృతి చెందడం బాధాకరమని, భక్తులను కంట్రోల్ చేయలేని తిరుమల చైర్మన్, బోర్డ్ మెంబర్లు బాధ్యత వహించాలని తెలిపారు.స్వామి వారిని అప్రతిష్ట పాలు చేస్తున్నారని, దేవుని ప్రసాదం తిందామంటే కల్తీ లడ్డులని భక్తులకు భయమేస్తుందని, సజావుగా దర్శనం చేసుకుందామంటే తొక్కిసలాట జరిగి మృత్యువాత పడుతున్నారని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి



ఒంగోలు, మేజర్‌న్యూస్: కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని, రాబోయే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలలో తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ బీఆర్ గౌస్ డిమాండ్ చేశారు. గురువారం నగర కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. రాజ్యాంగం రచించినటువంటి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను విమర్శించడం సిగ్గు చేటు అన్నారు. భారత దేశంలో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మను శాస్త్రాన్ని అమలు చేయాలనే ఆర్ఎస్ఎస్ అజెండాతో బిజెపి ప్రభుత్వం ముందుకు వెళుతుందని, లౌకికవాదులు రాజ్యాంగ శ్రేయోభిలాషులు అందరూ ఈ చర్యలను వ్యతిరేకించాలని గౌస్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కో చైర్మన్ ఉద్దండి మల్లికార్జునరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, ఒంగోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి, ఒంగోలు నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రవుఫ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరీం బేగ్, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు రాయపాటి గిడియన్, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సుధీర్‌వర్మ, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, దండుపాలు ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఫ్రెండ్లీ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అన్నదానం




మార్టూరు, మేజర్‌న్యూస్: ఫ్రెండ్లీ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ చిలకలూరిపేట వారిచే స్థానిక అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. చిలకలూరిపేటలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు ఆపన్నహస్తం కార్యక్రమం ద్వారా ప్రతి వారం అన్నదానం జరిపిస్తున్న వారికి ఆశ్రమ అధ్యక్షులు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీ హ్యాండ్స్ కార్యదర్శి కే.స్నేహ మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయటం అంటే దైవానికి సేవ చేసినట్లే అని మానవసేవే మాధవ సేవ అని వీరికి త్వరలో వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆశ్రమానికి మా సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

## సిద్ది మల్లికార్జునస్వామికి ఎరిక్షన్ ప్రత్యేక పూజలు

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని మోట్ల మల్లికార్జునపురంలో శ్రీ సిద్ది మల్లికార్జున స్వామి వారిని టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళి, టి.ఎన్.టి.యు.సి. బట్టు సుధాకర్ రెడ్డి, దేవయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రగాఢ సానుభూతి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: కుంత ద్వార దర్శనం టిక్కెట్ల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొక్కిసలాటలు చోటు చేసుకున్న ఘటనలో ఆరుగురు మృతి చెందారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్య శాఖకు సూచిస్తున్నాను. మృతులు, క్షతగాత్రుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఉన్నారని తెలిసింది. వారి కుటుంబీకులకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు సూచిస్తున్నాను. అదే విధంగా మృతుల కుటుంబాల దగ్గరకు వెళ్ళి పరామర్శించి మనో ధైర్యం ఇచ్చే బాధ్యతలు టీటీడీ పాలక మండలి తీసుకోవాలని అప్పిశెట్టి ఉదయ్ శంకర్ భారతీయ జనతా పార్టీ గిద్దలూరు టౌన్ అధ్యక్షులు తెలిపారు.

## ఘనంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



గిద్దలూరు, మేజర్‌న్యూస్:స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి సంక్రాంతి పండుగ విశిష్టతను పిల్లలకి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల వేషధారణ, నృత్య కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో భోగి మంటలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన చూడ ముచ్చటగా ఉన్నది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సంక్రాంతి పండుగ విశిష్టత పిల్లలకి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్ కుమార్, వెంకటలక్ష్మి, పర్వీన్, రిహానా, సువర్ణ రేఖ, కమ్మూరు నిషా, అంజలి, రమాదేవి, మంజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దేవస్థానంకు పూజా సామాగ్రి అందజేత



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని తిరుమలకొండ శ్రీదేవి భూదేవి తిరుమలనాథస్వామి దేవస్థానంనకు ఒంగోలుకు చెందిన జాజుల శ్యామ ప్రసాద్, మనోజ దంపతులు గురువారం పంచలోహ శఠగోపం, అక్షింతల బుట్ట, పూల అర్చన బుట్ట అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి సేవకులు పి.రామ్మూర్తి, రోశిరెడ్డి, రమణారెడ్డి తదితరులు దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేసి దాతలకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని అదేవిధంగా గురువారం వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


జన్మదిన
శుభాకాంక్షలు
శ్రీ పంతాని మురళీధరరావు గారు
కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్
మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు, శ్రేయోభిలాషి
ప్రజా సంక్షేమంకోసం అలుపెరగని పోరాటం
చేయుచున్నమంచి మనిషి,రేపల్లె అభివృద్ధి
ప్రధాత, పేద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి,
యంగ్ & డైనమిక్ లీడర్, మా అన్నయ్య
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ & స్టాంప్స్ శాఖామాత్యులు
శ్రీ అనగాని సత్య ప్రసాద్ గారికి
హృదయపూర్వక... జన్మదిన
శుభాకాంక్షలు...
దండుప్రోలు వెంకటేశ్వరరావు
దండుప్రోలు పిచ్చియ్య
పంతాని సాయికుమార్

## ఘనంగా ఆల్ఫా స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని బేస్తవారిపేట ఆల్ఫా పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను విద్యార్థినీ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం బేస్తవారిపేట పాఠశాల ఇంచార్జి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె.రామ్ కుమార్, కంభం ఆల్ఫా పాఠశాల ప్రిన్సిపల్ రితీష్ నాయర్ పాల్గొన్నారు. ఈ వేడుకలలో భాగంగా భోగి మంటలు, విద్యార్థినీ విద్యార్థుల పేరెంట్స్‌తో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారికి బహుమతులు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్, ప్రిన్సిపల్ ప్రతిక్ నాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హైవెండ్‌లో సంక్రాంతి సంబరాలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్. కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్లో హైవెండ్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజమాన్యం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు గురువారం అంబరాన్ని అంటాయి. ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఎండి సాయిమహేంద్రబాబు సాంప్రదాయ దుస్తులు ధరించిన బాలబాలికలతో భోగి మంటలను వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలో బొమ్మలకొలువును ఏర్పాటు చేశారు. చిన్నారులందరు పలు రకాలను ఆహారాలను తయారు చేసి విక్రయం కేంద్రం ఏర్పాటు చేసి ఆహారపదార్థాలను విక్రయించారు. చిన్నారులందరికి తల్లిదండ్రులు అందరిచేత భోగిపండ్లు పోయించి చిన్నారులకు ఆశీర్వచనాలు అందజే యించారు. సాంప్రదాయ కోడిపందాలను నిర్వహించారు. సాంప్రదాయ దస్తులతో ఫ్యాషన్ నిర్వహించారు. హరిదాసుల వేషములు ఏవసి అలరించారు. ముందుగా సంక్రాంతి పొంగలి పొంగించి విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, మండలప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉదయచంద్రరావు, ఎండి సాయిమహేంద్రబాబు, డైరెక్టర్లు ఆంజనేయప్రసాద్, చాందిని, వెంకటజ్యోతి, షర్కిలబేగం, రామలక్ష్మి, రఫి, రహీం, దివ్య, జెరీనా, హివ బిందు, రజియాసుల్తానా పాల్గొన్నారు.

## ఏరువారిపల్లిలో సంక్రాంతి సంబరాలు



కనిగిరి, మేజర్‌న్యూస్: మండలంలోని ఏరువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యురాలు మహబూబ్ ముంతాజ్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ముందుగా విద్యార్థినులు అందంగా ముగ్గులు వేసి రంగులతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. భోగిమంటలు, హరిదాసుల వేసాధారణలలో సంక్రాంతి సంబరాలు ఏంతో ఘనంగా జరిగాయి. ఈ సంధర్భంగా సంక్రాతి పండుగ పర్వదినం గురుంచి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి సిద్ధ వ్యవసాయానికి ఎన్‌పిఎం షాపు ప్రారంభం

వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని వేటపాలెం గ్రామంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని జింఖానా క్లబ్ నందు పురుగుమందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా పండే వ్యవసాయం కొరకు ఎన్ పీఎం షాప్ మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు ఓపెన్ చేయడమైనది. ఇందులో భాగంగా బాపట్ల డిపిఎం ఆఫీసర్ వాణిశ్రీ, అడిషనల్ డిపిఎం జానకి వేటపాలెం మండలంలో పనిచేస్తున్న క్యాడర్ అందరూ మరియు రైతులు ఈ షాప్ ఓపెనింగ్‌లో పాల్గొనడం జరిగింది. ఈ ఎన్‌పిఎం షాపు నందు వ్యవసాయానికి కావలసిన అన్ని రకాల పురుగుల వినాశనం కొరకు కషాయాలు మరియు మొక్కలు పెరుగుదలకు అమృతాలు ప్రకృతి వ్యవసాయం లో పండిన అన్ని రకాల ఉత్పత్తులు అమ్మబడునని, ముఖ్యంగా 22 పోషకాలతో కలిగిన బోయో కల్చర్ అమ్మబడునని, ఎల్లో ప్లేట్స్ లింగాకర్షణ బుట్టలు పంచగవ్య మీనామృతం దశపర్ణి అగ్నిస్త్రం బ్రహ్మాస్త్రం పలు రకాల కషాయాలు



అమృతాలు రైతులకు తక్కువ ధరలకు అమ్మబడునని, భూమిని బట్టి పోషక విలువలతో కూడిఉండి, మన ఆరోగ్యాలు మెరుగుపడటానికి ఈ వ్యవసాయం ముందుకు తీసుకువెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగాఏవోతెలిపారు. ఈ యొక్క ఎన్ పీఎం షాపులు అందుబాటులో ఉండడంవల్ల భూమి బాగుపడుతుందని మనుషులకు ఆరోగ్యం బాగుంటుందని డిపిఎం చెప్పడం జరిగింది. ఈ షాపును మీసాల శ్రీనివాసరావు వేటపాలెం యూనిట్ జింఖానా క్లబ్ నందు పెట్టడం జరిగింది.

# రాయల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

మార్టూరు, మేజర్‌న్యూస్: స్థానిక రాయల్ స్కూల్‌లో మకర సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థి తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆటలుపోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉన్న విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ముందస్తు మకరసంక్రాంతి వేడుకలకు పాఠశాల యాజమాన్యం చేసిన ఏర్పాట్లు తల్లిదండ్రులను ఎంతగానో ఆకార్షించాయి. ఈ వేడుకలలో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. భోగిమంటలు, అచ్చమైన పల్లెటూరి వాతావరణం ప్రతిబింబించేలా, వేంకటేశ్వరస్వామి ఆలయం నమూనా, ముగ్గుల పోటీలు, విద్యార్థినీ విద్యా ర్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించాయి. సంస్థ సెక్రటరీ, కరెస్పాండంట్ పేరం రవీంద్రబాబు మాట్లా డుతూ అందరికి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలి పారు.



సంస్థ ఇంచార్జి కే.మధుబాబు మాట్లాడుతూ పూర్వకాలంలో పల్లెటూర్లలో ఎలాంటి వాతావరణంలో సంక్రాంతి వేడుకలు జరిగేవో అలానే వేడుకలు జరిగాయాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, కరెస్పాండంట్ పేరం రవీంద్రబాబు, స్వప్న, ఇంచార్జి కే.మధుబాబు, ప్రిన్సిపాల్ బి.రాధిక, ప్రధానోపాధ్యాయులు డివి బాలసుబ్ర ణ్యం, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫాతిమా దీప్తి- చైతన్య స్ఫూర్తి

బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: దేశంలో లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి పోరాటం చేసిన తొలి మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా అని తెలియజేశారు బాపట్ల ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు. ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సాయిబాబా మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో దేశవ్యాప్తంగా బాలికల విద్య కోసం విశేషంగా పాటుపడిన గొప్ప విద్యావేత్త ఫాతిమా షేక్. పలు బాలికల పాఠశాలల స్థాపనకు ఆమె శ్రీకారం చుట్టారు. దేశంలో తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలుగా ఆమె ఖ్యాతికెక్కారు. సావిత్రిబాయి పూలే,



జ్యోతిబాపూలే లతో కలిసి దళిత బాలికల విద్యాభివృద్ధి కోసం ఆమె పాటుపడ్డారు. గాంధీజీ,నెహ్రూలతో కలిసి స్వాతంత్ర్యోద్యమంలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. స్త్రీలను చైతన్య పరచ డానికి ఆమె చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ భాస్కరరావు, డాక్టరు అబ్దుల్ కలామ్, డాక్టర్ గౌరి, డాక్టరు సుశీలవతి,డాక్టర్ సునీత. పద్మజ,వెంకటలక్ష్మమ్మ,,విద్యార్థులు పాల్గొన్నారు.

# తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు జయంతి సభ

బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: స్త్రీ విద్య కోసం కృషి చేసిన మహిళా మణులలో ఫాతిమా షేక్ ఒకరని సాహితీ భారతి గౌరవాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది ఎం జాకబ్ కొనియాడారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194 వ జయంతి సభకు జాకబ్ అధ్యక్షత వహించారు. అమెరికన్ మిషనరీ నిర్వహిస్తున్న సింథియా ఫర్రార్ అనే ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో సావిత్రిబాయి పూలే తో పాటు ఫాతిమా షేక్ కూడా ఉపాధ్యాయ శిక్షణ పొందారని జాకబ్ తెలియజేశారు .ఈ విధంగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ చరిత్రలో నిలిచిపోయారని ప్రశంసించారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ నాటి సమాజం స్త్రీ విద్యను వ్యతిరేకించిందని బాలికల పాఠశాల



నిర్వహణకు జ్యోతిరావు పూలే కు ఎవరూ ఇల్లు ఇవ్వలేదని అన్నారు. ఈ సభలో ఆదం షఫీ, డి సామ్యూల్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# అంబారాన్ని తాకుతున్న క్రికెట్ పోటీలు

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి కాలేజ్‌లో గొట్టిపాటి, నారపుశెట్టి మెగా క్రికెట్ పోటీలు అంబరాన్ని అంటుతు న్నాయి. గురువారం 12 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఉద యం నుండి సాయంత్రం వరకు పోటీలు జరిగాయి. ఈ నెల 12 వరకు క్రికెట్ పోటీలు జరగనున్నాయి. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను డి.సి. ఎటీం కైవసం చేసుకుంది. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను డి.సి.ఎ టీం పండుకు టిడిపిజిల్లా మీడియా కో ఆర్డినేటర్ పఠాన్ సుభాన్ అందచేశారు.



## అతివేగంతో ప్రాణనష్టం

- ఎస్సై కె.మాధవరావు



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కనిగిరి టూ కంభం రోడ్డులో గురువారం సాయంత్రం హాజీపురం క్రాస్ రోడ్‌లో బైకులను ఆటోలను ఎస్సై కె.మాధవరావు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగంగా డ్రైవింగ్ చేయడం వలన ప్రాణ నష్టం జరుగుతుందని హటోలలో పరిమితిని మించి ప్రయాణికులు ఎక్కించుకోవటం వలన ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. అలాగే ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని బండి పత్రాలు ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నారు. అనంతరం ఈ చలానా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవాలయంలో విస్తృత ఏర్పాట్లు



వేటపాలెం, మేజర్ న్యూస్: మం డల పరిధిలోని వేటపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామివారి దేవస్థానం ఆలయ ప్రాంగణము నందు ఈ నెల 10వ తేదీ శుక్రవారం రోజున వైకుంఠ ఏకాదశి పర్వదినమున (ముక్కోటి ఏకాదశి) పురస్కరించుకొని శ్రీవారి దేవస్థానము నందు వైకుంఠ ఏకాదశి ఉభయ దాతలు, శాశ్వత ఉభయ దాతలు కే.వి.ఎస్ మనువడు కిరణ్ కుమార్ వీరి సతీమణి రాధా మాధవి ఆధ్వర్యంలో శ్రీ చెన్నకేశవ స్వామి వారికి విశేష అర్చన, ఉత్తర ద్వార దర్శనంలో శ్రీ చెన్నకేశవ స్వామి వారికి విశేష అర్చన జరుగునని భక్తులు సకాలంలో విచ్చేసి స్వామివారిని అమ్మవారిని దర్శించి శ్రీవారి దివ్య ఆశీస్సులు పొందగలరని కోరుచున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఉప్పరపాలెం బృందావనం కాలనీలో ముగ్గుల పోటీలు



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం బృందావనం కాలనీలో లో ఉన్న రామాలయం గుడి దగ్గర బండ్రెడ్డి రజని ముగ్గుల పోటీ నిర్వహించి మొదటి, రెండు, మూడు బహుమతులుగా చీరలు అందచేసి, మిగతా ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి ప్లాస్టిక్ డబ్బాలు అందించి రజని సంక్రాంత్రి శుభాకాంక్షలు తెలియచేసి పండుగ విశేషాలు వివరించారు.

## భోగి మంటలతో శుభాకాంక్షలు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: సంక్రాంతి సంబరాలు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు ఆవరణలో గురువారం విద్యార్థులు రకరకాల వేషధారణలతో వచ్చి ఆటపాటలతో కోలాటం, సంక్రాంతి యొక్క విశిష్టతను కనబరిచారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగిమంటలతో అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏజయం.శివ నాగరాజు, ప్రిన్సిపాల్ భాగ్యరాణి, ఏఓ. సాంబశివరావు , ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూలులో సంక్రాంతి సంబరాలు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం భీమావారి పాలెం శ్రీ చైతన్య స్కూలు ఆవరణలో గురువారం విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో హరిదాసు, గంగిరెడ్డి వాళ్ళ వేషధారణలతో వచ్చి అందరిని అలరించారు. రంగ వల్లులతో ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. భోగిమంటలు, పొంగళ్లతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ మాధురి దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారులకు భోగి పండ్ల వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ఏటీఎం అంజయ్య, అప్పాజీ పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. పిల్లలకు తమ ఆశీర్వాదాలను అందజేశారు. అనూష, రవికుమార్, అజయ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకం ఉపయోగించుకోవాలి



కర్లపాలెం, మేజర్‌న్యూస్: పీఎం సూర్య ఘర్ పథకం వల్ల రాబోయే తరాల వారికి కరెంట్ కష్టాలు తీరుతాయని విద్యుత్ శాఖ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ఆంజనేయులు అన్నారు.కర్లపాలెం పెద్దింటమ్మ తల్లి కల్యాణ మండపంలో విద్యుత్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తొలుత కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీ లలో బాపట్ల డివిజన్ లోని 11 మంది ఏ ఈ లు ,లైన్ ఇన్స్పెక్టర్లు ,లైన్ మెన్లు,అసిస్టెంట్ లైన్ మెన్లు ,జూనియర్ లైన్ మెన్స్ వివిధ విద్యుత్ సర్వీసులను తనిఖీలు నిర్వహించారు.వినియోగదారులు ఉన్న లోడు కంటే అదనంగా వాడుకొంటున్న లోడును కేసులుగా బుక్ చేసి అపరాధ రుసుము విధించారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ,పొన్నూరు ,చెరుకుపల్లి డి ఇ ఇ లు శ్రీనివాసరావు, శ్యాంకుమార్,విజయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# పల్లెకు ప్రగతి సిరి - ఉపాధికి ఊపిరి: కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మేజర్‌న్యూస్: గ్రామాలలోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటం మురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి మండల అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని 25 మండలాలలో కేటాయించిన పనులను 100% పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం, కాలువ తవ్వకాలు, నీటినిల్వల ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు వారి మండలాలలో రోజుకు 10 వేల154 మందితో పని చేయిస్తామని యాప్ లో డిమాండ్ పెడుతున్నారన్నారు. రోజుకు 6617 మంది మాత్రమే పనిచేస్తున్నట్లు ఎంఎంఎస్ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు. డిమాండ్ ఇచ్చిన దానికి పనిచేసేలా వ్యత్యాసాలను గమనించి పని చేయించాలన్నారు. కొన్ని మండలాల్లో పనులు ఇప్పటికీ మొదలు పెట్టలేదని వాటిని చూసుకొని పనులు ప్రారంభించాలన్నారు. 100 రోజులు పని దినాలను మండలాలలో



27,843 కుటుంబాలకు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికీ 1935 కుటుంబాలకు పని కల్పించామని అన్నారు. ప్రణాళిక ప్రకారం కుటుంబాలకు పని కల్పించిన ఎడల లక్ష్యాలను పూర్తి చేయగలమన్నారు. ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టి మరియు ఇతర కులాలకు జాబ్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీ కులాల కుటుంబాలకు 34.46%, ఎస్టి కులాల కుటుంబా లకు 33.29%, ఇతర కులాల కుటుంబాలకు 35.04% గా పని దినాలు కల్పించాలని అన్నారు. ఇతర కులాల కుటుంబాల కంటే ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఎక్కువ పని దినాలు కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో పసువుల షెడ్డు ఏర్పాటుకు ఉన్న లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ 183 బేస్మెంట్ లెవెల్,170 గ్రౌండ్ లెవెల్లోనే ఉన్నాయని అన్నారు. నిర్దిష్ట సమయానికి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో పంచాయతీ సెక్రటరీలు, గ్రామ సచివాలయ సిబ్బంది క్లాప్ మిత్రుల ద్వారా ఇంటింటికి వెళ్లి, గ్రామ సభలు ఏర్పాటు చేసి, బీటా టామ్ టామ్ ద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి అందించుటలో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారిక సంప్రదించి సేకరించిన తడి పొడి చెత్తలను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించాలన్నారు. చెత్తను కాల్చి వేయడం గానీ, రోడ్లకు ఇరువైపులా పడవేయడం గాని చేసిన యెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. నీటి కలుషితం ద్వారా డయేరియా వంటి వ్యాధులు గుర్తైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పైప్ లైన్ల లీకేజీలను గమనించి మరమ్మత్తులు చేయించాలన్నారు. నీటిని క్లోరినేషన్ చేసే విషయం లో మండలాల అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ జయంతి వేడుకలు

అద్దంకి, మేజర్‌న్యూస్: ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలైన ఫాతిమా షేక్ 194వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ముందుగా ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపధ్యాయురాలు పద్మావతి మాట్లాడు తూ ఫాతిమా షేక్ నేటి మహిళా ఉపాధ్యాయనిలకు ఆదర్శప్రాయురాలు అని ఆమె స్ఫూర్తితో అందరూ సేవా దృక్పథంతో పనిచేయాలని అన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్



బాబు మాట్లాడుతూ ఆరోజులలో జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే లను మహిళలకు విద్యను నేర్పిస్తున్నారనే కారణంతో వారిని ఊరిలో నుండి వెలివేసినప్పుడు వారికి ఫాతిమా షేక్ మరియు వారి సోదరుడు ఉస్మాన్ షేక్ వారి ఇంటిలో ఆశ్రయం ఇచ్చి అండగా నిలబడి జ్యోతిరావ్ పూలే దగ్గర విద్య నేర్చుకొని సావిత్రిబాయితో పాటు మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా అనేకమందికి విద్యనందించి అనేక సేవా, ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్న ఆదర్శప్రాయురాలని ఆమె జయంతి జరుపుకోవడం యావత్భారతీయుల బాధ్యత అనీ అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చారిత్రక పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్ జె డి ఉబ్బ దేవపాలన, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తాళ్లూరి బాబురావు, ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొని పాఠశాలలో పనిచేస్తున్న 9మంది మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువా బొకేలతో ఘనంగా సన్మానించినారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులు అందించిన కలెక్టర్

బాపట్ల, మేజర్‌న్యూస్: క్రీడలతో ఏకాగ్రత ఆరోగ్యకరమైన పోటీతత్వం విద్యార్థుల్లో పెరుగుతుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల, సెంట్రల్ ఆంధ్ర, ప్రముఖ పత్రిక సంస్థల సంయుక్తంగా వేటపాలెం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ప్రాంతీయ స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. బాపట్ల, పశ్చిమ గోదావరి, కృష్ణ, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి పాల్గొన్న క్రికెట్ టీం లకు సీనియర్, జూనియర్ విభాగాలలో పోటీలు జరిగాయి. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం జరిగిన ముగింపు సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. విద్యతోపాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని కలెక్టర్ చెప్పారు. రెండు దశాబ్దాల క్రితం ఆధునికమైన సాంకేతిక రంగం, కంప్యూటరీకరణ లేకపోవడంతో ఆటపాటలపైనే యువత దృష్టి ఉండేదన్నారు. అప్పటి విద్యార్థులు, యువతకు విద్య, ఆటపాటలు మాత్రమే ఆహ్లాదాన్ని ఇచ్చేవని వివరించారు. నేడు అలాంటి ఆహ్లాదాన్ని విద్యార్థులు కోల్పోతున్నారన్నారు. పత్రిక సంస్థ



సమాజంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అన్నదమ్ముల్లా విడిపోయిన రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ క్రీడా పోటీలను నిర్వహిస్తుం దన్నారు. రూ.రెండు కోట్లు వెచ్చించి క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విజేతలైన క్రీడాకా రులను అభినందించారు. ఓటమి పాలైన క్రీడాకారులు మరింత స్ఫూర్తితో గెలుపు వైపు ముందుకు సాగాలన్నారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, తహసిల్దార్ పార్వతి, కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, కార్యదర్శి వనమా రామకృష్ణారావు, ప్రధాన ఆచార్యులు కే జగదీష్ బాబు, పత్రిక సంస్థ మేనేజర్ వెంకటేశ్వర్లు, పిడి అన్నం శ్రీనివాస రావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు కే.బిట్రగుంటలో ఎర్ర కిరణ్ అంతిమయాత్ర



జరుగుమల్లి, మేజర్ న్యూస్: మండల పరిధిలోని కే.బిట్రగుంట గ్రామ టిడిపి యువనేత ఎర్ర కిరణ్ ఈనెల 8వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. అయితే అతని బంధువులు అమెరికాలో ఉండటంవల్ల అతని మృతదేహం మార్చురీలో ఉంచారు. అయితే శుక్రవారం మధ్యాహ్నాం రెండు గంటలకు ఎర్ర కిరణ్ మతదేహాన్ని అంతిమయాత్ర కార్యక్రమం చేపడుతున్నట్లు బిట్రగుంట గ్రామస్తులు పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యని అంతిమయాత్రకు హాజరవుతున్నట్టు తెలిపారు.

# రైజ్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు







జరుగుమల్లి, మేజర్‌న్యూస్: సంస్కృతి సంప్రదాయాల విశ్లేషణ విద్యార్థులు విలువైనజ్ఞానాన్ని పొందే అవకాశము ఉందని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇన్స్టిట్యూషన్ కార్యదర్శి శిద్దా హనుమంత రావు పేర్కొన్నారు. సంస్కృతి పట్ల లోతైన అవగాహన కలిగిన వారికి సహన శక్తి వంటి గుణాలు అలవాడుతాయని ఆయన తెలిపారు. గత రెండురోజులుగా రైజ్ కళాశాలలో ముం దస్తు సంక్రాంతి సంబరాలను రాగ ఆధ్వర్యంలో నిర్వ హించినట్లు మొదటి రోజున విద్యార్థినులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. వారిలో విజేతలను నిర్ణయించేందుకు అతిధిగా శిద్దా సూర్యకుమారి విచ్చేసి విజేతలను నిర్ణయించి వారికి బహుమతులను అందచేశారు. అనంతరం 2వ రోజున విద్యార్థులకు కబడ్డీ పోటీలు, టాగ్ అఫ్ వార్ పోటీలు నిర్వహించి వారిలో విజేతలకు రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, కళాశాల ట్రెజరర్ శిద్దా భారత్ చేతులమీదుగా సర్టిఫికెట్స్, కప్పులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్ డాక్టర్ ఏవి భాస్కర రావు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వి.రమేష్, రాగ కోఆర్డినేటర్స్ సురేఖ, స్రవంతి, శాంతి, ఫిజి కల్ డైరెక్టర్స్ ఎస్.హిమచంద్రా బాబు, సుబ్బారావు, విజయ సారా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ద్వారా విశిష్ట సేవలు: రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి



పంగులూరు, మేజర్‌న్యూస్ : రోటరీ క్లబ్ ద్వారా సమాజానికి అవసరమైన ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో ప్రపంచంలోనే రోటరీక్లబ్ ముందుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. శరత్ చౌదరి అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆ అవసరాలను అనేక రకాలుగా తీర్చడంలో రొటీరియన్స్ ఎంతో కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. గురువారం పంగులూరులోని రోటరీ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో శరత్ సోదరి మాట్లాడుతూ, పంగులూరు రోటరీ క్లబ్బు మంచి మంచి ప్రాజెక్టులు నిర్వహిస్తుందని ఆయన అభినందించారు. పంగులూరు క్లబ్ ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని, వారు కూర్చుని చదువుకునేందుకు బెంచీలు, ముఖ్యమైన కూడళ్ళలో సిమెంట్ బెంచీలు, పేదలకు కంటి పరీక్షలు చేయించి, కంటి ఆపరేషన్లు చేయించడం, పేద మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వడం, చదువుకునే విద్యార్థినులకు సైకిల్ ఇవ్వటం వంటి అనేక మంచి కార్యక్రమాలు ఈక్లబ్ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు.

**విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ...**

రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ద్వారా ముప్పవరం గ్రామంలోని హైస్కూల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు సైకిళ్లను రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి పంపిణీ చేశారు. విద్యార్థులు సైకిల్ పై పాఠశాలకు రావటం వలన ఒక గంట సమయం కలిసి వస్తుందని, ఈ సమయంలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పంగులూరులో రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ పంగులూరు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేశావళి, బత్తుల వీరనారా యణ, గవర్నర్ స్పెషల్ అసిస్టెన్సీ సింగారావు, క్లబ్బు క్యాంపు చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, రోటరీ సభ్యులు గుర్రం ఆంజనేయులు, రాయిని వెంకటసుబ్బారావు, రాయిని రామారావు, గరిమిడి జగన్ మోహన్‌రావు, వీ.నరసింహారావు, కరణం హనుమంతరావు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, పోలిశెట్టి సీతారామయ్య, చిలంకూరి వెంకటేశ్వరరెడ్డి, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, సెక్రటరీ మాదాల సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు రావి అంకమ్మ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం నియోజకవర్గ నవ్యాంధ్ర మాదిగ చర్మ, డప్పు కళాకారుల పోరాట సమితి అధ్యక్షునిగా అంబటి



కొనకనమిట్ల, మేజర్ న్యూస్: నవ్యాంధ్ర మాదిగ చర్మ కారులు, డప్పు కళాకారుల పోరాట సమితి మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షునిగా మండలంలోని పెద్దారి కట్ల గ్రామానికి చెందిన అంబటి సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ నియమా క పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షునిగా ఎన్నికైన అంబటి సుబ్బారావు మాట్లాడుతూ నామీద ఎంత నమ్మకంతో బాధ్యత అప్పజెప్పిన నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారులు పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగకి,జిల్లా అధ్యక్షులకు మార్కాపురం నియోజక వర్గంలోని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నాయకులు దేవయ్య మాదిగ పాల్గొన్నారు.

## అమిత్ షాపై సస్పెన్షన్ వేటు వేయాలి

### కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీపతి సతీష్ డిమాండ్



టంగుటూరు, మేజర్ న్యూస్: ప్రపంచమంతా గర్వించ దగ్గ అతి గొప్ప భారత రాజ్యాంగాన్ని నిర్మించిన భారతరత్న స్వర్గీయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను సస్పెండ్ చేయాలని కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీపతి సతీష్ డిమాండ్ చేశారు. టంగుటూరు మండల పరిధిలో తూర్పునాయుడు పాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. ప్రజల చేత సంతకాలు చేసిన మెమొరాండం అంబేద్కర్ పాదాలు చెంత పెట్టి జై బాపూజీ...జై భీమ్..జై సంవిధాన్ శ్రీకారం చుట్టిన కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీపతి సతీష్ ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడారు. రాజ్యాంగ నవనిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దుర్మార్గానికి తెర లేపాడు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ వాక్యాలను సుమోటోగా స్వీకరించి అమిత్ షా పై 14 ఏళ్ల జైలు శిక్ష విధించాలని ఈ వ్యాఖ్యలకు బిజెపికి స్నేహితులైన బాబు పవన్ జనసేన రహస్య స్నేహితుడు జగన్ స్పందించి అమిత్ వ్యాఖ్యలను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏసుపోగు దావీదు, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలేటి మహేష్, కాంగ్రెస్ నాయకులు నావూరి రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కోటిరెడ్డి, రావూరి వెంకటేశ్వర్లు, కమలాకర్, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## శర్మ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: తెలుగుజాతి తన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు కృషి చేయాలని సిఎస్ఆర్ శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలకు ఎం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భాషతో పాటు సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి జాతి విహిత కర్తవ్యమని స్పష్టం చేశారు. ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇంగ్లీష్ లెక్చరర్ గాయత్రి తదితరులను అభినందించారు. అనంతరం విద్యార్థులు భోగి మంటలను వేయడంతో పాటు నృత్యాలను ప్రదర్శించారు. ఇంగ్లీష్ లెక్చరర్ గాయత్రి నేతృత్వంలో ఏర్పాటైన ముందస్తు సంక్రాంతి వేడుకలలో పలువురు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## డీప్ బోర్లను ప్రారంభించిన కందుల విఘ్నేష్ రెడ్డి



పొదిలి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీలోని కాటూరి వారి పాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు డీప్ బోర్లను గురువారం మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి తనయుడు, యువ నాయకులు కందుల విఘ్నేష్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ముల్లా కుద్దుస్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్ బాబు, చిన్న చెరువు నీటి సంఘం ప్రెసిడెంట్ చాగంటి వెంకట్రావు, బూత్ కన్వీనర్లు కాటూరి హనుమంతరావు, ఉప్పు బాబు, మండల కార్యదర్శి కాటూరి శ్రీనివాసరావు, మండల నాయకులు కాటూరి చినబాబు, సామంతపూడి నాగేశ్వర రావు ,తానికొండా వెంకట్రావు, రసూల్, దంతులూరి వెంకట్రావు, రావిపాటి ఆంజనేయులు , కొల్ల నరేంద్ర,గంధం నరేంద్ర, రావిపాటి అశోక్, అవులూరి వెంకట నారాయణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు టిటిడిలో ఉద్యోగాలు ఇవ్వాలి

### – మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య

ఒంగోలు, మేజర్‌న్యూస్: తిరుమలస్వామి వారి వైకుంఠ ద్వారా దర్శనం కోసం వచ్చిన భక్తుల తోపులాట, తొక్కిసలాట కారణంగా ఆరుగురు మరణించడం అత్యంత బాధాకరమైన విషయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. స్వామి వారి దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇది తగదని పేర్కొన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిలో ఏమాత్రం అలసత్వం తగదు, వైకుంఠ ద్వారా దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ వీఐపి తాకిడి, సేవ తగ్గించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆశిస్తున్నామన్నారు.

## ఏపి ఎన్జీవో మహిళా కార్యవర్గ సమావేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలొని ఏపిఎన్జీవో హోంలో గురువారం మహిళా కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కె. కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హ్యూమన్ వింగ్ చైర్‌పర్సన్ నిర్మలా కుమారి, రాష్ట్ర హ్యూమన్ వింగ్ కన్వీనర్ పి. మాధవి, ఆల్ ఇండియా గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హ్యూమన్ కన్వీనర్ ఎన్. రాజ్యలక్ష్మిలు పాల్గొని మహిళా సమస్యల గురించి నివేదికను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించామని, పలు అంశాలో ఏ విధంగా పరిష్కారం చేయాలో వివరించారు. జిల్లా అధ్యక్షులు కె. శరత్ బాబు, ఆర్ సిహెచ్ కృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కార్యాలయంలో పని చేస్తున్న మహిళలు, జిల్లా మహిళా కన్వీనర్ సిహెచ్ శిరీష, కార్యవర్గ మహిళలు నారాయణమ్మ, రత్నరాణి, జిల్లా ఏపిఎన్జీవో కోశాధికారి కె. శివ కుమార్, ఒంగోలు తాలూకా కార్యదర్శి ఎస్‌కె షరీఫ్, అంజనాదేవి, ప్రణతి, జయమ్మ, సావిత్రి, శివజ్యోతి, కవితా, పద్మజ, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



కందుకూరురూరల్, మేజర్ న్యూస్: పట్టణంలోని టి. ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. భోగిమంటలతో ఈ సంక్రాంతి సంబరాలు ప్రారంభించబడ్డాయి. ఇందులో భాగంగా విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించబడింది. సంక్రాంతి లక్ష్మి, రైతు,పల్లె పడుచు, హరిదాసు, ఎరుకల సోది,గోపిక మొదలగు వేషాలతో విద్యార్థులు ప్రేక్షకులను అలరించారు. ముగ్గుల పోటీలో భాగంగా విద్యార్థులు వేసిన ముగ్గులు చూపరులను కనుల పండుగగా ఆకట్టుకున్నాయి. ఫుడ్ ఫెస్టివల్, వేషధారణ,ముగ్గుల పోటీ మొదలైన పోటీలందు విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేయడమే కాక బహుమతులు అందజేశారు.

## నాగార్జున పబ్లిక్ స్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



కందుకూరురూరల్, మేజర్‌న్యూస్: పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థులు గాలిపటాలను ఎగరవేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కరస్పాండెంట్ అందరూ కలిసి భోగిమంటలు వేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ షాలిని రెడ్డి, మర్రెడ్డి, బాల బ్రహ్మం, శ్రీనివాసులు, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు అందరూ పాల్గొన్నారు.

## మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్వేత

పంగులూరు, మేజర్‌న్యూస్: పంగులూరు మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా టి. శ్వేత ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు తాసిల్దార్ పి. సింగారావు క నియామక ఉత్తర్వులు అందజేశారు. శ్వేత కొరిశపాడు మండల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ బదిలీపై పంగులూరుకు వచ్చారు. పంగులూరు తాసిల్దార్ కార్యాలయంలో గత 7 నెలల నుండి ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం రామకూరు వీఆర్వో బాబయ్య ఇన్చార్జ్ ఆర్ ఐ గా బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు ఆర్ఐగా శ్వేత బాధ్యతలు చేపట్టింది.